క్లుప్తంగా

ప్రశాంతంగా వేలం పాట



ఆలయ ప్రాంగణంలో వేలంపాట నిర్వహిస్తున్న దృశ్యం

గడివేముల: మండల కేంద్రంలో వెలసిన మూల పెద్దమ్మ అమ్మవారి జాతర సందర్భంగా తలనీలాల సేకరణ కొరకు సోమవారం వేలం పాటలు నిర్వహించినట్లు ఈఓ రామలింగారెడ్డి తెలిపారు. నెలరోజుల పాటు జరిగే జాతరకు గతేడాది రూ.1,67,500 ఆదాయం రాగా ప్రస్తుతం 1.70 లక్షలకు వేలంలో హెచ్చు పాడి దక్కించుకున్నారని చెప్పారు. పర్యవేక్షణ అధికారి హరిచంద్రారెడ్డి, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ వసంతలక్ష్మి

కోడుమూరు రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నిర్ణయించిన మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం వడ్డించాలని ఎంఈఓ వసంతలక్ష్మి వంట ఏజెన్సీ మహిళలను ఆదేశించారు.సోమవారం కోడుమూరు బీసీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించి పాఠశాల రికార్డుల, విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పట్టికలను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పెడుతున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలిచ్చారు.

హుండీ పగులగొట్టి చోరీ

పాణ్యం: మండల పరిధిలోని వడ్డుగండ్ల ఆంజనేయస్వామి ఆలయంలో హుండీని గుర్తు తెలియని దుండగులు పగులగొట్టి నగదు చోరీ చేశారు. ఘటనపై సోమవారం గ్రామస్తులు, ఆలయ నిర్వాహకులు పాణ్యం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆలయంలో దాదాపు ఐదు సంవత్సరాల నుంచి హుండీ లెక్కించలేదని రూ.50 వేల వరకు నగదు ఉంటుందని పేర్కొన్నారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు.

టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం

పాణ్యం: మండల పరిధిలోని నెరవాడ మెట్ట వద్ద ఉన్న శాంతిరామ్ ఇంజినీరింగ్ కళాశాలలో డిజిటల్ జర్నీపై విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఆయన సోమవారం మాట్లాడుతూ.. కెరీర్ డెవలప్‌మెంట్ సెల్, నాస్కామ్ సంస్థ సంయుక్తంగా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ మిషన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్ టెక్నాలజీపై వివరించారన్నారు. ఈ సర్టిఫికెట్ ప్రొగ్రాం ద్వారా విద్యార్థులకు లేటెస్ట్ ఎమర్జింగ్ టెక్నాలజీపై అవగాహన కల్పించినట్లు చెప్పారు. విద్యార్థులు టెక్నాలజీని అందిపుచ్చుకోవాలన్నారు. ఇంతియాజ్ పాల్గొన్నారు.

బడ్జెట్లో జిల్లాకు తీరని అన్యాయం



కోడుమూరులో ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

కోడుమూరు రూరల్: కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో కర్నూలు జిల్లాకు తీరని అన్యాయం జరిగిందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కృష్ణ తెలిపారు. జిల్లా సమగ్రాభివృద్ధికి, ప్రాజెక్టుల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడాన్ని నిరసిస్తూ సోమవారం కోడుమూరు పాతబస్టాండ్ సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గుండ్రేవుల, వేదావతి, ఆర్డీఎస్, హంద్రీనీవా, గురురాఘవేంద్ర ప్రాజెక్టుల నిర్మాణాలకు నిధులు విడుదల చేయకపోవడం దారుణమన్నారు. సీపీఐ మండల కార్యదర్శి రాజు, స్థానిక నాయకులు మధు, భీముని స్వామి, ఏఐఎస్ఎఫ్, ఏఐటీయూసీ నాయకులు రంగస్వామి, చిన్న, ఖాజా, దస్తగిరి, హమాలీ కార్మికులు పాల్గొన్నారు.

నయనానందకరం.. యాగంటీశ్వరుని రథోత్సవం

- అశేష జనసందోహంతో హోరెత్తిన పుణ్యక్షేత్రం
- అలరించిన సినీ సంగీత విభావరి
- ముగిసిన స్వాములవారి ఆరాధనోత్సవాలు



మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డిని సత్కరిస్తున్న ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి



అశేష భక్తజనం మధ్య తరలిపోతున్న స్వాముల వారి రథం

ఓర్వకల్లు: మండలంలో రెండవ అతిపెద్ద ఆధ్యాత్మిక క్షేత్రమైన ఎన్.కొంతలపాడు గ్రామంలో వెలుగొందుతున్న అంబాసహిత యాగంటీశ్వర స్వాముల వారి రథోత్సవం సోమవారం తెల్లవారుజామున కనులపండువగా సాగింది. స్వాముల వారి ఆరాధనోత్సవాలలో భాగంగా ఆలయ ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి పర్యవేక్షణలో ఉత్సవ కమిటీ సభ్యులు శ్రీనివాసులు ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించిన స్వాముల వారి ఆరాధనోత్సవాలు ప్రశాంతంగా ముగిశాయి. అంతకుముందు ఆలయ అర్చకులు ఉరుకుందయ్యాచారి స్వామివారికి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి ఉత్సవమూర్తిని పట్టు వస్త్రాలతో అలంకరించారు. అనంతరం పల్లకీలో ఆశీనులు గావించి డప్పులు, మంగళవాయిద్యాల నడుమ ఆలయ ప్రాంగణం నుంచి రథశాల వద్దకు చేర్చారు. ఈ లోగా సాంప్రదాయ పద్ధతిలో రథాంగ హోమం, రథాంగ బలి నిర్వహించి విశిష్ట పూజలు చేశారు. తర్వాత ఉత్సవమూర్తిని సర్వాంగ సుందరంగా అలంకరించిన రథంపై అధిష్టింపజేశారు. పంచాక్షరి నాదంలో హరహర మహాదేవ.. శంభోశంకర అంటూ రథాన్ని ముందుకు కదిలించారు. అశేష జన సందోహం మధ్య తరలిపోతున్న స్వాముల వారిని భక్తులు కనులారా వీక్షించి రథంపైకి పూలు, పండ్లు విసిరి తన్మయం చెందారు. స్థానిక నంది స్థూపం వరకు వెళ్లిన రథాన్ని తిరిగి పూర్వ స్థానానికి చేర్చారు. ఈ సందర్భంగా మంగళ వాయిద్యాలు, డప్పుల శబ్దాలు, భక్తుల కరచాలధ్వనులు, ఓంకార నాదంతో ఆలయ క్షేత్రం మార్మోగింది. సుమారు గంట పాటు సాగిన రథోత్సవంలో అవాంతరాలు చోటు చేసుకోకుండా ఎస్ఐ సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు.

అలరించిన సంగీత విభావరి

స్వాముల వారి ఆరాధనోత్సవాల సందర్భంగా బుధవారం రాత్రి ఆలయ ప్రాంగణంలో ప్రదర్శించిన సినీ సంగీత విభావరి ప్రేక్షకులను అలరించింది. హైదరాబాద్‌కు చెందిన జానపద కళాస్రవంతి వారు ఆలపించిన జానపద గీతాలు ప్రేక్షకులను ఉత్తేజపరిచాయి.

స్వాములవారిని దర్శించుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆరాధనోత్సవాల సందర్భంగా సోమవారం ఉదయం వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మీదివేముల ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ తిప్పన్న, జెడ్పీటీసీ సభ్యుడు రంగనాథ్‌గౌడు యాగంటీశ్వర స్వామిని దర్శించుకున్నారు. స్వాముల వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు కాటసానికి సాదర స్వాగతం పలికి సత్కరించారు. గ్రామ సర్పంచు మధుకేశన్న, నాయకులు కె.మద్దయ్య, మల్లికార్జునప్ప, మాధవస్వామి, రాముగౌడు, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు జీకే వెంగన్న, నాగతిరుపాలు, తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారంతో అల్పాహారం

స్వాముల వారి ఆరాధన సందర్భంగా ఆదివారం రాత్రి పలువురు దాతల సహకారంతో భక్తులకు అన్నదానం,అల్పాహారం ఏర్పాటు చేశారు. కర్నూలు, బుధవారపేట వాస్తవ్యులు అంబిలి నాగమ్మ, పాపయ్య జ్ఞాపకార్థం వారి కుమారులు చంద్రమౌళి, అమర్‌నాథ్ దాదాపు రెండు వేల మంది భక్తులకు అల్పాహారం పంపిణీ చేశారు.

ఉపాధి కూలి వెంటనే చెల్లించాలి



పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం ఇస్తున్న ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

కల్లూరు: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనిచేసిన వేతనదారులకు తొమ్మిది వారాలుగా పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం మండల క్యాదర్శి రామాంజనేయులు, మధు డిమాండ్ చేశారు. సోమవారం ఉలిందకొండ గ్రామ సచివాలయంలో కార్యదర్శి నాగేశ్వరరావుకు వినతి పత్రమిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తొమ్మిది వారాలుగా పని చేసిన వేతనదారులకు ఇంతవరకు వేతనాలు చెల్లించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్‌కళ్యాణ్‌కు ఉపాధి కూలీల పట్ల ఎంత శ్రద్ధ ఉందో తెలుస్తోందన్నారు. పనులు చేసిన వారికి సకాలంలో వేతనాలు అందకపోవడంతో కూలీల కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వంద రోజుల పని పూర్తయిన కుటుంబాలకు అదనపు పని దినాలు కల్పించాలన్నారు. కూలీలకు పనిముట్లు, పే స్లిపులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో భార్గవి, చంద్రశేఖర్, రాజు, కేశవులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల వివరాలు ఎందుకు పంపలేదు?

- తహసీల్దార్‌ను ప్రశ్నించిన జేసీ నవ్య
- చెట్టు ప్రమాద బాధితుల పరిస్థితిపై సమాచారమివ్వాలని ఆదేశం



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఇన్‌చార్జ్ తహసీల్దార్ పురుషోత్తం, ఏఓ మల్లేష్‌కుమార్

సి.బెళగల్: పోలకల్ హైస్కూల్ ప్రమాద సంఘటనలో గాయపడిన విద్యార్థుల వివరాలు తమకు ఎందుకు పంపలేదని మండల ఇన్‌చార్జ్ తహసీల్దార్ పురుషోత్తంను జేసీ నవ్య ప్రశ్నించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పురుషోత్తం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించారు. అయితే మండలంలోని పోలకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చెట్టు కూలిన ఘటనలో ఏడుగురు విద్యార్థులు గాయపడగా, ఒక విద్యార్థిని మృతి చెందింది. కాగా సోమవారం పోలకల్‌కు చెందిన ప్రమాద బాధిత విద్యార్థినుల తల్లిదండ్రులు కర్నూలులోని సునయన ఆడిటోరియంలో జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా నిర్వహించిన పీజీఆర్‌కు చేరుకుని తమ పిల్లల పరిస్థితి గురించి ఎవరూ పట్టించుకోవడం లేదని జేసీకి ఫిర్యాదు చేశారు. దీనితో జేసీ వీడియో కాన్ఫరెన్స్‌లో ఇన్‌చార్జ్ తహసీల్దార్ పురుషోత్తంను ప్రశ్నించారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. తాము ఆర్డీఓ కార్యాలయానికి మాత్రమే సమాచారం పంపామని చెప్పగా.. వెంటనే బాధితుల పరిస్థితిని తమకు తెలియజేయాలని జేసీ ఆదేశించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి (ఏఓ) మల్లేష్‌కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మల్లేశ్వరి మాత్రమే హాజరయ్యారు. అయితే మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రాణెమ్మ విడిగా ఏర్పాటు చేసిన పీజీఆర్ఎస్‌కు ఈఓఆర్డీ ఈశ్వరయ్యస్వామి, హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు సుమంత్, గోనేనాయక్, ఎంఈఓ జ్యోతి, ఏపీఓ రామన్న హాజరయ్యారు.

హద్దులు తేల్చేందుకు సర్వే



సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్లు, సీఐలు

పాణ్యం: పాణ్యం మండలం తమ్మరాజుపల్లె – సిమెంట్ నగర్ ఘాట్‌లో హద్దుల కోసం అధికారులు సర్వే చేపట్టారు. ఈ ఘాట్‌లో నిత్యం రోడ్డు ప్రమాదాలు, అఘాయిత్యాలు, చోరీ ఘటనలు చోటు చేసుకుంటున్న తరుణంలో ఏదైనా జరిగితే తమ పరిధిలోకి రాదంటూ రెండు మండలాల పోలీసులు చేతులెత్తేస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం బేతంచెర్ల సీఐ వెంకటేశ్వరరావు, ఎస్ఐ రమేష్‌బాబు, తహసీల్దార్ ప్రకాష్‌బాబు, పాణ్యం తహసీల్దార్ నరేంద్రనాథ్ రెడ్డితో పాటు, పాణ్యం పోలీసుల ఆధ్వర్యంలో సర్వే చేపట్టారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అధికారులు హద్దుల కోసం సర్వే చేయడంపై ప్రజలు విస్మయం చెందుతున్నారు. అలాగే అటవీశాఖ అధికారులు మ్యాప్‌ను పరిశీలించి పూర్తి స్థాయిలో సర్వే చేసిన తర్వాత హద్దులు ఏర్పాటు చేయనున్నారు.

హద్దుల సర్వే ఎందుకు?

తమ్మరాజుపల్లె – సిమెంట్ నగర్ ఘాట్ రోడ్డు అంటే బైక్‌పై వెళ్లేవారు ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొని వెళ్లాల్సిందే. ఈ ఘాట్ రోడ్డు పట్టపగలే దారి దోపిడీలకు అడ్డాగా మారింది. ఈ నెల 9న బేతంచెర్లకు చెందిన జశ్వంత్ నంద్యాల నుంచి బైక్‌పై బేతంచెర్లకు వెళుతుండగా బొలేరోతో ఢీకొట్టి దాడి చేసి అతని వద్ద ఉన్న బంగారు వస్తువులను లాక్కెళ్లారు. ఈ ఘటనపై ఉదయం నానా హంగామా చేసిన పోలీసు అధికారులు తమ హద్దు కాందటే తమది కాదని వదిలేశారు. ఈ క్రమంలో క్షతగాత్రుడిని చికిత్స కోసం బేతంచెర్ల నుంచి కర్నూలుకు తీసుకెళ్లారు. రాత్రి వరకు ఎక్కడా కేసు నమోదు కాలేదు. తీరా తెల్లవారుజామున 4 గంటలకు పాణ్యం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో ఆయా పోలీసు స్టేషన్ల హద్దులు తేల్చేందుకు రెవెన్యూ, అటవీశాఖ, పోలీసు ఉన్నతాధికారుల సమక్షంలో సర్వే చేపట్టారు. గతంలో ఎన్నడూ ఇలాంటి పరిస్థితి లేదని నేరాలపై పోలీసులు పట్టించుకోకపోవడంతోనే ప్రస్తుతం సర్వే చేపట్టినట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు.

బెల్ట్ షాప్‌లు ఎక్కువయ్యాయి!

- నవోదయంపై అవగాహన కార్యక్రమంలో గోరుకల్లు మహిళల ఫిర్యాదు
- బెల్ట్ షాప్‌లు తొలగిస్తామన్న ఎక్సైజ్ సీఐ కృష్ణమూర్తి



గోరుకల్లులో మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ కృష్ణమూర్తి

పాణ్యం: నాటుసారాతో పాటు బెల్ట్ షాపులు ఎక్కువయ్యాయని, వాటి పరిస్థితి ఏమిటని గోరుకల్లు మహిళలు ఎక్సైజ్ అధికారులను ప్రశ్నించారు. ఎక్సైజ్ అధికారుల ఆధ్వర్యంలో సోమవారం గ్రామంలో నవోదయం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాటుసారా తయారు చేసినా, విక్రయించినా చర్యలు తీసుకుంటామని సీఐ కృష్ణమూర్తి మాట్లాడుతుండగా.. సమావేశంలో కుర్చున్న మహిళలు కల్పించుకుని.. గ్రామంలో బెల్ట్ షాప్‌లు ఎక్కువయ్యాయని, ఎక్కడపడితే అక్కడ మద్యం విచ్చలవిడిగా దొరుకుతుండటంతో మందుబాబులు బహిరంగంగానే మద్యం తాగుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని చెప్పారు. బెల్ట్ షాప్‌లపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. సీఐ కృష్ణమూర్తి స్పందిస్తూ బెల్ట్ షాపుల వ్యవహారం తమ దృష్టికి రాలేదని, వెంటనే విచారణ జరిపి వాటిని తొలగిస్తామన్నారు. బెల్ట్ షాపులపై తమకు సమాచారం ఇవ్వాలని, సమాచారం చెప్పిన వారి వివరాలు గోప్యంగా ఉంచి నిర్వాహకులపై తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

పోలీస్ స్టేషన్ చేరిన ప్రశ్నాపత్రాలు



ప్రశ్నాపత్రాలను పోలీస్‌స్టేషన్‌లో పరిశీలిస్తున్న అధికారులు

సి.బెళగల్: పదవ తరగతి వార్షిక పరీక్షల మొదటి సెట్ ప్రశ్నాపత్రాలు సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్ చేరుకున్నాయి. వాటిని రూట్ అధికారి, పందిపాడు జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం అబ్దుల్‌రహీం, అదనపు రూట్ అధికారి, బిల్లేకల్ జెడ్పీ హైస్కూల్ తెలుగు ఎస్ఏ రమణగౌడ్ స్థానిక పోలీస్ స్టేషన్‌కు చేర్చారు. అనంతరం మండల ప్రశ్నాపత్రాల నిర్వహణ అధికారి (కస్టోడియన్),సి.బెళగల్ జెడ్పీ హైస్కూల్ ఎస్ఏ మల్లయ్య, జాయింట్ కస్టోడియన్, గురుకుల పాఠశాల డిపార్టుమెంట్ అధికారి చనుగండ్ల జెడ్పీ హైస్కూల్ బయాలజీ ఎస్ఏ అన్వర్‌బాషా ఎస్ఐ తిమ్మారెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్‌లో భద్రపరిచారు. మండలంలో మూడు పరీక్ష కేంద్రాలకు సంబంధించి మొదటి సెట్ స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ బాలరాముడు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ వంశీమోహన్, పరీక్షల నిర్వహణ అధికారులు వివరాలను నమోదు చేసుకున్నారు. తెలుగు పేపర్ నుంచి సోషల్ పేపర్ వరకు వచ్చాయని కస్టోడియన్లు తెలిపారు.

పనిభారం తగ్గించాలి



ఎంపీడీఓ నాగశేషాచలరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న పంచాయతీ కార్యదర్శులు

కల్లూరు: పంచాయతీ కార్యదర్శులందరూ పని ఒత్తిడి వల్ల మానసిక వేదనకు గురవుతున్నారని ఏపీ గ్రామ పంచాయతీ కార్యదర్శుల అసోసియేషన్ ట్రెజరర్ శేషన్న అన్నారు. పని భారం తగ్గించాలని కోరుతూ సోమవారం మండలంలోని పంచాయతీ కార్యదర్శుల సంఘం ఆధ్వర్యంలో ఎంపీడీఓ నాగశేషాచలరెడ్డికి వినతి పత్రమిచ్చారు. ఈ సందర్భంగా ఏపీ గ్రామ పంచాయతీ కార్యదర్శుల అసోసియేషన్ ట్రెజరర్ శేషన్న మాట్లాడుతూ.. రెండవ శనివారం, ఆది వారం, ఇతర సెలవు రోజులలో కూడా పంచా యతీ కార్యదర్శులు వివిధ రకాల సర్వేలు, ప్రభుత్వ నిర్దేశిత కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. పండుగలు, సెలవు రోజులలో కూడా కుటుంబ సభ్యులతో సమయం గడపలేక పని ఒత్తిడి వల్ల అనారోగ్యానికి గురవుతున్నారని వివరించారు. పంచాయతీ కార్యదర్శులపై పనిభారం తగ్గించాలని కోరారు. పంచాయతీ కార్యదర్శులు శ్రావణ్‌కుమార్, విజయ్‌కుమార్, చంద్రకళావతి బాయి, విశ్వతేజ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గోకారమయ్య ఉరుసు



బురాన్‌దొడ్డిలో గంధంను ఊరేగింపుగా తీసుకెళ్తున్న దృశ్యం

సి.బెళగల్: మండలంలోని బురాన్‌దొడ్డి గ్రామంలో గోకారమయ్య ఉరుసు సోమవారం వైభవంగా జరిగింది. గ్రామంలోని కేవీ కిరణ్ ఇంటి నుంచి ఆదివారం అర్ధ రాత్రి అనంతరం ప్రత్యేక పూజల అనంతరం స్వామివారి గంధంను, జెండాలు, గుర్రంను మేళతాళాలతో ఊరేగింపుగా దర్గాకు తీసుకెళ్లారు. సోమవారం ఉదయం ఏడు గంటలకు దర్గాకు చేరుకోగా, గ్రామ పెద్దలు, భక్తులు దర్గాలో జెండాలను ఆవిష్కరించారు. మంగళవారం జరిగే కిస్తీతో ఉత్సవాలు ముగుస్తాయని గ్రామ పెద్దలు తెలిపారు. ఇదిలా ఉండగా.. పలుకుదొడ్డి గ్రామంలో బడేఖాన్ ఖాద్రీ ఉరుసు సోమవారం ముగిసిందని గ్రామస్తులు తెలిపారు. మూడు రోజులుగా గ్రామంలో జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా సోమవారం కిస్తీ కార్యక్రమాన్ని భక్తులు, గ్రామస్తులు ఘనంగా నిర్వహించుకున్నారు.

కూలీలకు వేతనాలు చెల్లించాలి



ఇ.తాండ్రపాడులో నిరసన తెలుపుతున్న కూలీలు

కర్నూలు(రూరల్): ఉపాధి హామీ పనులు చేసిన కూలీలకు వేతనాలు చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి.నారాయణ డిమాండ్ చేశారు. మండలంలోని ఈ. తాండ్రపాడు గ్రామంలో కార్మిక సంఘం మండల కార్యదర్శి పి.బి హుసేనయ్య, సర్పంచ్ బాలపీరతో కలసి ఉపాధి కూలీలను కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లడుతూ పనులు చేసి 9 వారాలైన కూలీలకు వేతానాలు చెల్లించలేదన్నారు. వివిధ డిమాండ్ల సాధన కోసం ఈ నెల 12న విజయవాడలో మహాధర్నా నిర్వహిస్తూనామని విజయవంతం చేయాలని కోరారు.

'యువత పోరు'ను విజయవంతం చేద్దాం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఈ నెల 12న తేదీన నంద్యాల జిల్లా కేంద్రంలో చేపడుతున్న 'యువత పోరు' కార్యక్రమాన్ని చేద్దామని ఆ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం సాయంత్రం కాటసాని తన స్వగృహంలో యువత పోరు పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కాటసాని మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగ యువతకు నెలకు రూ.3 వేలు భృతి ఇవ్వాలన్నారు. ఐదు త్రైమాసికాలుగా ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన కింద ఇవ్వాల్సిన రూ.4,600 కోట్ల బకాయిలను తక్షణమే విడుదల చేయాలన్నారు. కొత్త మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ ప్రయత్నాలను ఉపసంహరించుకోవాలన్నారు. పేద విద్యార్థులకు వైద్య విద్యను అందుబాటులో ఉంచాలన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండలాల వివిధ అనుబంధ సంఘాల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

యువతకు అండగా వైఎస్సార్‌సీపీ



యువత పోరు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ ఆదిమూలపు సతీష్

కర్నూలు(రూరల్): నిరుద్యోగ భృతి,ఫీజు రీయింబర్స్‌మెంట్,తల్లికి వందనం తదితర సంక్షేమ పథకాలు అమలు చేయకపోవడం, కూటమి ప్రభుత్వ చర్యలను నిరసిస్తూ యువతకు అండగా వైస్సార్‌సీపీ యువత పోరు పేరిట ఈనెల 12వ తేదీన ఆందోళన కార్యక్రమం చేపడుతుందని నియోజకవర్గంలోని పార్టీ అన్ని విభాగాల నాయకులు, యువత తరలిరావాలని నియోజక వర్గ ఇన్‌చార్జ్ డా.ఆదిమూలపు సతీష్ పిలుపునిచ్చారు. నగరంలోని ఎ క్యాంప్‌లోని తన కార్యలయంలో సోమవారం పార్టీ నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు వెంకటేశ్ ఆధ్వర్యంలోయువత పోరు పోస్టర్లను విడుదల చేశారు. ఆయన మాట్లడుతూ ఈనెల 12 న కర్నూలు కలెక్టరేటు ఎదుట ఆందోళన నిర్వహించేందుకు కార్యచరణ రూపొందించామన్నారు. అధికారంలోకి వస్తే 20 లక్షల ఉద్యోగాలిస్తామని, లేకపోతే రూ.3వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పిన నేతలు ఇప్పటి వరకు ఒక్క ఉద్యోగమైనా ఇచ్చారా అని ప్రశ్నించారు.స్వార్థ ప్రయోజనాల కోసం కోసం మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరించే ప్రయత్నాలు చేస్తున్నారని, విరమించుకోవాలని డిమాండ్ చేశారు. జెడ్పీటీసీ ప్రసన్నకుమార్, కర్నూలు వైస్ ఎంపీపీ నెహమియా, అధికార ప్రతినిధి ప్రభాకర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, మాజీ మండల ఉపాధ్యక్షుడు వాసు, మండల కన్వీనర్ పెరపోగు మోహన్‌బాబు, కోడుమూరు ఎస్సీ సెల్ అధ్యక్షుడు బొజ్జన్న, అదాం తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సభల్లో ప్రజలంతా పాల్గొనాలి

కోడుమూరు రూరల్: మండలంలోని గ్రామ పంచాయతీల్లో ఈనెల 13వ తేదీన జరిగే గ్రామ సభల్లో ప్రజలంతా పాల్గొనాలని ఎంపీడీఓ రాముడు కోరారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రభుత్వ, దాతల, ప్రజల భాగస్వామ్యంతో ప్రతి ఇంటికి అభివృద్ధి, ప్రతి జీవితానికి ప్రగతి' అనే పోస్టర్లను మండల అధికారులతో కలిసి ప్రారంభించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ఈనెల 13న జరిగే గ్రామ సభల్లో పీ4 సర్వే ద్వారా సేకరించిన వివరాలను గ్రామ సభల్లో ప్రజల ముందు ఉంచుతామన్నారు. ప్రజలంతా ఆయా గ్రామ సభల్లో పాల్గొని పేదరిక నిర్మూలన కోసం తమ తమ అభిప్రాయాలను తెలియజేయాలని సూచించారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ శ్రీనివాసులు, హార్టికల్చర్ ఆఫీసర్ మదన్‌మోహన్, సూపరింటెండెంట్ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలేకు నివాళి

పాణ్యం: బాలికా విద్యకు ఆద్యులు సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో ఎస్ఎస్‌యూఐ జిల్లా కార్యదర్శి ప్రతాప్, ప్రజాసంఘాల నాయకులు శ్రీనివాసులు ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలోని సావిత్రిబాయి పూలే విగ్రహానికి నివాళులర్పించారు. వైస్ ప్రిన్సిపాల్ భారతి మాట్లాడుతూ.. సమాజ దార్శనికురాలు, మహిళలకు విద్య అందించాలని ఎన్నో ఉద్యమాలు చేసిన వీర మహిళ సావిత్రిబాయి అని కొనియాడారు. బాల్యవివాహాలు, మూఢ నమ్మకాలు, సతీసహగమనానికి వ్యతిరేకంగా పోరాటాలు చేశారన్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే పాణ్యం డిగ్రీ కళాశాలలో సావిత్రిబాయి పూలే వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. సమాజ పార్టీ జిల్లా అధ్యక్షుడు శివక్రిష్ణయాదవ్, సీపీఎం న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి అరుణ్‌కుమార్, ఉపాధ్యాయురాలు తదితరులు సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.